కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 25, పచ్చిమిర్చి 60, బెండ 40, కాకర 60, దొండ 50, దోస 30, ఆలు 35, చామ 60, కీర 40, బీర 60, వంకాయ 40, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 40, క్యారెట్ 50, చిక్కుడు 70, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 250.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

అల్విన్‌కాలనీ: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌యస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరపున రిక్షాపుల్లర్స్ కాలనీలో శుక్రవారం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రచారం చేశారు. కమ్యూనిటీ హాలు దగ్గర డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి గడప గడపకు వెళ్లి కరపత్రాలు అందజేసి కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్, బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు పశువుల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ప్రతి శని, ఆదివారాల్లో రెండురోజుల పాటు రంగారెడ్డి జిల్లా నార్సింగ్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల సంత జరుగుతుంది. ఈ సంతకు నగరంతో పాటు పలు జిల్లాల రైతులు వచ్చి పశువుల అమ్మకాలు, కొనుగోళ్లు చేస్తుంటారు.

శ్రీవారి కల్యాణం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి శనివారం శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీకే కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కల్యాణం జరుగుతందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

29 న నిధి ఆప్‌కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా ఈ నెల 29న నిధి ఆప్‌కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ శ్రీ విశాల్ అగర్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...మూడు కేంద్రాల్లో శిబిరాలను ఉదయం 9.30 నుండి సాయంత్రం 5.45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.మూడు శిబిరాల వివరాలు.... రంగారెడ్డి జిల్లా చందానగర్ అను ఫర్నిచర్, పటాన్‌చెరు మండలం పాశమైలారం ది విలాస్ పాలిమర్స్ లిమిటెడ్, మున్సిపల్ కౌన్సిల్, అందోల్ –జోగిపేటలలో భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు, పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఓటరు చైతన్య ర్యాలీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టే ర్యాలీను విజయవంతం చేయాలని అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఓటుహక్కుపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా శనివారం సాయంత్రం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉర్జిత్విల్లాస్‌లో మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుతో ముఖాముఖి ఉంటుందని ఆయా కాలనీలవాసులు పాల్గొనవచ్చని తెలిపారు.

ధరణినగర్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ధరణినగర్‌లో ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

అల్విన్‌కాలనీ: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి ఓటు వేయాలంటూ ధరణినగర్‌లో ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సంజీవరెడ్డి, బి. కృష్ణ ముదిరాజ్‌లు, పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం పాదయాత్ర చేశారు.పార్టీ కరపత్రాలు పంచుతూ, హస్తం గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, భాస్కర్‌రెడ్డి, గుడ్ల శ్రీనివాస్, సంగమేష్, అగ్రవాసు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

మూసాపేట: ఈజీ మనీ కోసం గంజాయి విక్రయిస్తున్న నిందితుడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్, శ్యామ్‌నగర్‌కు చెందిన సద్దాం హుస్సేన్ (32) మూసాపేటలోని అంజయ్యనగర్‌లో నివసిస్తూ కూలి పనిచేసుకుంటున్నాడు. భార్యా, పిల్లలను స్వంత ఊరులోనే ఉంచి పని కోసం నగరానికి వచ్చాడు. ఈజీ మనీకి అలవాటు పడి వెస్ట్ బెంగాల్ నుంచి గంజాయి తీసుకొచ్చి తోటి కూలీలకు విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకొని సద్దాం హుస్సేన్ రూమ్ నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని అతడిని రిమాండ్‌కు తరలించారు.

యువకుడు అదృశ్యం



ఎగ్గిరెడ్డి శ్రీధర్

గచ్చిబౌలి: ఇంటర్వ్యూకు వెళుతున్నానని చెప్పి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సాయన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా చింతరెడ్డి పాలెంకు చెందిన ఎగ్గిరెడ్డి శ్రీధర్(22) గౌలిదొడ్డిలోని శ్రీసాయి బాలజీ రెసిడెన్సీలోని పీజీ హాస్టల్‌లో సోదరుడు సాయి ప్రతాప్‌తో కలిసి నివాసం ఉంటున్నాడు. తిరుపతిలో ఇంటర్వ్యూ ఉందని చెప్పి ఈ నెల 24న సాయంత్రం 5 గంటలకు బయటకు వెళ్లాడు. 25న ఉదయం 11.30 ఫోన్ చేయగా ట్రైన్‌లో ఉన్నానని చెప్పాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో శ్రీధర్ స్నేహితులను ఆరా తీయగా ఇంటర్వ్యూకు రాలేదని చెప్పారు.దీంతో సోదరుడు సాయి ప్రతాప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



‘రెడీ టూ స్టార్ట్’..

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చేరువలో టీ ఆకారంలో ‘ఫ్లైఓవర్’

జూన్ మొదటి వారంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు

రాయదుర్గం: ఎట్టకేలకు గోపన్‌పల్లితండా కూడలిలోని ఫ్లైఓవర్ తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఇటీవల ట్రాఫిక్ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఈ ఫ్లైఓవర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. జూన్ మొదటి వారంలో ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నారు. గౌలిదొడ్డి రోడ్డు నుంచి గోపన్‌పల్లి, గోపన్‌పల్లితండా వైపు వెళ్ళడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత అందుబాటులోకి రానుంది.

రెండు ప్రాంతాలవైపు వన్‌వే..

- గోపన్‌పల్లితండా జంక్షన్‌లో గౌలిదొడ్డి వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా తెల్లాపూర్ కొల్లూరు వైపు వెళ్లవచ్చు
- ఇటు కుడి మలుపు తీసుకొని గోపన్‌పల్లి, నల్లగండ్ల వైపు వెళ్లేందుకు వీలు కల్పించి వన్‌వే వంతెనగా రూపొందించారు
- అయితే గోపన్‌పల్లి నుంచి, గౌలిదొడ్డి నుంచి వట్టి నాగులపల్లికి వెళ్లేవారు మాత్రం ఫ్లైఓవర్ కింద రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.
- గోపన్‌పల్లి, గోపన్‌పల్లితాండ నుంచి ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి, ఓఆర్‌ఆర్‌పైకి వెళ్ళడానికి ఇది ప్రధానరోడ్డు
- శ్రీదేవి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల, అంతర్జాతీయ స్థాయి పాఠశాల, విప్రో సంస్థ, సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాల, ఐటీ కంపెనీలకు, పలు గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ల వాసులు రాకపోకలు సాగిస్తుండడంతో నిత్యం వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది.
- ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరనుంది.



గోపన్‌పల్లితండా కూడలిలో ప్రారంభించనున్న మరో ఫ్లైఓవర్ ఇదే..

పై వంతెన వివరాలు..

- వంతెన దూరం.. 400 మీటర్లు
- ‘టీ’ ఆకారంలో నిర్మాణం
- వ్యయం..రూ.30 కోట్లు
- గ్రీనరీ.. ఫ్లైఓవర్ పక్కనే సర్వీస్‌రోడ్డు ఆనుకొని ఏర్పాటు

- రెండేళ్లుగా కొనసాగినా పనులు పూర్తవడంతో వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు సూచిస్తున్నారు.
- ఫ్లైఓవర్ మీద వేగ నియంత్రణ బోర్డులు, ఆయా మార్గాల్లో ఎటువైపు వెళ్లవచ్చో సూచికబోర్డులను ఏర్పాటు చేయడంతో బాటు ఇరువైపులా గోడలపై ఇనుప కంచెను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చేవెళ్ల గడ్డపై హ్యాట్రిక్ విజయం సాధిస్తాం..

- ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
- గంగారంలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



గంగారంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, పార్టీ నాయకులు

శేరిలింగంపల్లి: చేవెళ్ల గడ్డపై మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా శుక్రవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారం విలేజ్, పలు కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు పెంచి సామాన్యుల నడ్డివిరిచిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి చూసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ మధురానగర్‌కు చెందిన మహిళలు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఖాజాగూడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారికి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌కు మెజార్టీ సాధనే లక్ష్యంగా పనిచేస్తామని వారు అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దారుగుపల్లి నరేష్ పాల్గొన్నారు.

27 నుండి ఉర్సు

నిజాంపేట్: బాచుపల్లిలోని జీతేపీర్ దర్గా ఉర్సు ఉత్సవాలను ఈ నెల 27 నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 27న సందాల్, 28న చిరాగన్, 29న మీనా బజార్ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ఇండియన్ హెరిటేజ్ ఆర్ట్ టూర్ ప్రారంభం

ఆర్ట్ గ్యాలరీలో ప్రారంభించిన నటి స్రవంతి



జానపదచిత్రాలను తిలకిస్తున్న విజువల్ ఆర్టిస్ట్, నటి స్రవంతి జులూరి తదితరులు

లక్డీకాపూల్: శిల్పాభా పేరుతో ప్రతికృత్, పాప్పానితో ఏర్పాటైన ఇండియన్ హెరిటేజ్ ఆర్ట్ టూర్ హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభమైంది. భారతదేశపు ప్రాచీన సంప్రదాయ జానపద కళా చిత్రాలను పరిరక్షించే క్రమంలో ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఈ ఆర్ట్ టూర్ కొనసాగుతుంది. శుక్రవారం మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో తెలంగాణ ప్రముఖ విజువల్ ఆర్టిస్ట్, నటి స్రవంతి జులూరి ఆర్ట్ టూర్‌ను ప్రారంభించారు. ప్రముఖ కళాకారులు సరస్వతి లింగంపల్లి, అన్నపూర్ణ మడిపడిగ, మరేడు రామ్ హాజరైన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ ఆర్ట్ టూర్ తో భారతదేశపు 6వ శతాబ్దానికి చెందిన కళా సంప్రదాయాలకు మరింత ఆదరణ తెచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శనివారం నుంచి రెండు రోజుల పాటు ‘శిల్పాభా’ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు చెరియాల్ స్క్రోల్ పెయింటింగ్ వర్క్‌షాప్ ఉంటుందని..దీనిని తెలంగాణలోని చెరియాల్ కళాకారులు ఎస్. గణేష్, వనంజా నిర్వహిస్తారన్నారు. భారతీయ జానపద కళ సొగసు, లోతును అనుభవించడానికి కళాభిమానులను, విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారు.

బీఆర్ఎస్ కరపత్రాల పంపిణీ



రాయదుర్గంలో ఇంటింటి ప్రచారంలో సాయిబాబా, నాయకులు

రాయదుర్గం: పార్లమెంటు ఎన్నికలలో గచ్చిబౌలి డివిజన్‌లో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ సాధనే లక్ష్యంగా పనిచేస్తామని మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెన్నంరాజు, జంగయ్య, సతీష్, నరేష్, అంజమ్మ, రాజుముదిరాజ్, అశోక్‌యాదవ్, జగదీష్, బూత్ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ లెర్నింగ్ టూల్ ఆవిష్కరణ

ప్రయోగాత్మకంగా మొయినాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పరిశీలన




నూతన ఆవిష్కరణను ప్రయోగాత్మకంగా అమలు చేసి పరిశీలిస్తున్న బృందం

రాయదుర్గం: మాట్లాడే భాషలో నైపుణ్యం కోసం అన్వేషించే ఔత్సాహికులకు సహాయపడే సాధనాన్ని గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ఆర్థిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు కీలకం ఇంగ్లిష్. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు ఆంగ్లం నేర్చుకునే వనరులు అందుబాటులో లేవు. దీనిని అధిగమించడానికి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని రాజ్‌రెడ్డి సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ సొసైటీ (ఆర్‌సీటీఎస్) పరిశోధకులు ఇంగ్లిష్ స్పీచ్ మూల్యాంకనానికి టీచింగ్ అసిస్టెంట్‌గా ఉపయోగపడే ఇంగ్లిష్ లెర్నింగ్ టూల్‌ను అభివృద్ధి చేశారు. ట్రిపుల్‌ఐటీలోని ఆర్‌సీటీఎస్‌లోని సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ అర్జున్ రాజశేఖర్ మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీలోని లాంగ్వేజ్ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ (ఎల్‌టీఆర్‌సీ)లోని స్పీచ్ ప్రాసెసింగ్ ల్యాబ్ నుంచి ప్రొఫెసర్ చిరంజీవి యర్రా అభివృద్ధి చేసిన స్పీచ్ అసెస్‌మెంట్‌ను తరగతి గదిలో అభ్యాస సాధనంగా ఉపయోగించవచ్చన్నారు. రంగారెడ్డిజిల్లా మొయినాబాద్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మార్చిలో ఈ అప్లికేషన్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేయడంతో విద్యార్థులు ఉత్సాహంగా స్వీకరించారు. నూతన ఆవిష్కరణపై పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

హెచ్‌సీయూకు ఇండియన్ పేటెంట్ మంజూరు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఇండియన్ పేటెంట్ మంజూరు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ నుంచి ప్రొఫెసర్ రాజదురై చంద్రశేఖర్, అతని పూర్వ పీహెచ్‌డీ విద్యార్థి డాక్టర్ వప్పు వినయ్ ప్రదీప్‌కు ‘మాలిక్యులర్ సింగిల్–క్రిస్టల్ ఫోటోనిక్ మైక్రో–రెసోనాటర్స్ అండ్ ఫర్మేథింగ్ పర్మేషన్’ ఆవిష్కరణ కోసం భారతీయ పేటెంట్ చేయబడింది. పేటెంట్ చట్టం 1970లోని నిబంధనలకు అనుగుణంగా 20 సంవత్సరాల కాలానికి ఈ పేటెంట్‌ను అందించారు. ప్రస్తుత ఆవిష్కరణ అనేక ఫోటోనిక్ అప్లికేషన్‌లలో ఉపయోగపడే పరమాణు సింగిల్ క్రిస్టల్‌తో కూడిన మైక్రో రెసోనేటర్‌లను అందిస్తుంది. ప్రొ.రాజదురై చంద్రశేఖర్ ఆర్గానిక్ సింగిల్–క్రిస్టల్ ఫోటోనిక్ భాగాలను రూపొందించే సాంకేతికతకు ‘క్రిస్టల్ ఫోటోనిక్స్ ఫౌండ్రీ’ అని పేరు పెట్టారు. ఇండియన్ పేటెంట్ పొందడం పట్ల పలువురు ప్రొఫెసర్లు వారిని అభినందించారు.



పేటెంట్ పొందిన ప్రొ.రాజదురై చంద్రశేఖర్, విద్యార్థి డా.వినయ్‌ప్రదీప్

29 నుంచి చిత్రలేఖనంలో శిక్షణ

నిజాంపేట్: వేసవి సెలవులను పురస్కరించుకుని ప్రగతినగర్‌లోని సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చిత్రలేఖనంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు సత్యవోలు రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుండి మే 24వ తేదీ వరకు కొనసాగే శిక్షణలో డ్రాయింగ్, కలర్ పెయింటింగ్, ఆయిల్ పెయింటింగ్, ఆక్రిలిక్ కలర్ పెయింటింగ్, పొర్ట్రైట్ డ్రాయింగ్, అనాటమి డ్రాయింగ్, నైఫ్ పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్‌లలో శిక్షణ ఇవ్వనున్నారు. 5 సంవత్సరాల పిల్లల నుండి పెద్దల వరకు ఆసక్తి గల వారు 9959971679 / 9849490663 నంబర్లలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

44 సెంటర్‌లలో జీహెచ్‌ఎంసీ క్రీడా శిక్షణ శిబిరాలు

మరో 10 రోజుల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం

మూసాపేట: కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్లలో జీహెచ్‌యంసీ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ఇంకా 10 రోజుల వరకు చేరేందుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విద్యార్థులు ఈ శిబిరాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే ప్రారంభమైన క్రీడా శిబిరంలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకొని చేరవచ్చన్నారు. 6–14 ఏళ్ల వయసు గల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులు, ప్రతి రోజు ఉదయం 6.30 నుంచి 8.15 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

- మూసాపేట సర్కిల్ పరిధిలో 33 సెంటర్లు ఉన్నాయి. వీటిలో బాల్ బాడ్మింటన్ కేపీహెచ్‌బీ రమ్యా గ్రౌండ్‌లో, బాస్కెట్ బాల్ కేపీహెచ్‌బీ 7వ ఫేజ్, వసంత్‌నగర్‌లో, క్రికెట్‌కు కేపీహెచ్‌బీ 7వ ఫేజ్ ప్లే గ్రౌండ్–2, భువన విజయం ప్లే గ్రౌండ్, కరాటేకు భువన విజయం ప్లే గ్రౌండ్, 6వ ఫేజు ప్లే గ్రౌండ్, గాయత్రినగర్ పార్కు, పాండురంగానగర్ పార్కు, రోలర్ స్కేటింగ్‌కు కేపీహెచ్‌బీ కాలనీ బతుకమ్మ కుంట, షటిల్ బాడ్మింటన్‌కు కేపీహెచ్‌బీ 7వ ఫేజులోని ప్లే గ్రౌండ్ 1, కేపీహెచ్‌బీ రమ్యా ఇండోర్ స్టేడియం, వసంత్‌నగర్ ఇండోర్ స్టేడియం, ఆంజనేయనగర్ ఇండోర్ స్టేడియం, గాయత్రినగర్ ఇండోర్ స్టేడియం, ధనలక్ష్మీ కేపీహెచ్‌బీ 5వ ఫేజు డిమార్టు, రమ్యా గ్రౌండ్ 2, టేబుల్ టెన్నిస్‌కు కేపీహెచ్‌బీ 7వ ఫేజ్, టెన్నిస్‌కు కేపీహెచ్‌బీ 7వ ఫేజు, ఆంజనేయనగర్ ప్లే గ్రౌండ్, వసంత్‌నగర్, కేపీహెచ్‌బీ 5వఫేజ్ ప్లే గ్రౌండ్–రోజరీ స్కూల్ ఎదురుగా, సుభాష్ చంద్రబోస్ ప్లే గ్రౌండ్, వాలీబాల్‌కు కేపీహెచ్‌బీ 7వ ఫేజ్, భరత్‌నగర్ యువసేన, రమ్యా ప్లే గ్రౌండ్, భరత్ నగర్ శివసేన, అల్లూరి సీతారామరాజు ప్లే గ్రౌండ్, డా. చంద్రశేఖర్ ప్లే గ్రౌండ్, వసంత్‌నగర్ ప్లే గ్రౌండ్, ధనలక్ష్మీ, కేపీహెచ్‌బీ 5వ ఫేజు డిమార్టు వద్ద క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు.
- కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో కబడ్డీ ఆస్‌బెస్టాస్ కాలనీ ప్లే గ్రౌండ్, షటిల్ బాడ్మింటన్, వాలీబాల్ ప్రశాంతినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ క్రీడల్లో ఆడేందుకు ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో స్పోర్ట్స్.జీహెచ్‌యంసి.జీఓవి.ఇన్‌లో 10 రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 25 నుంచి మే 30 వరకు క్రీడలు కొనసాగుతున్నప్పటికి మరో 10 రోజుల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రోడ్లపై నిర్మాణ సామగ్రి వేస్తే జరిమానా

- జీహెచ్‌ఎంసీ అధికారులు
- నానక్‌రాంగూడలో రూ.25 వేలు పెనాల్టీ



నానక్‌రాంగూడలో జరిమానా విధించిన జీహెచ్‌ఎంసీ ఎస్ఎస్ జలంధర్‌రెడ్డి, ఇతర ఉద్యోగులు

రాయదుర్గం: రోడ్లపై నిర్మాణ సామాగ్రి వేసి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తే నిర్మాణ సంస్థలకు జరిమానా విధిస్తామని జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఎస్ఎస్ జలంధర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన నానక్‌రాంగూడలో సుమధుర నిర్మాణ సంస్థ కట్టడానికి వచ్చే భారీ వాహనాల రాకపోకల సమయంలో నిర్మాణం మిశ్రమం రోడ్డు పైకి వచ్చేలా వేయడం చూసి పెనాల్టీ విధించారు. అనంతరం ఆయన మాట్లాడారు. శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి నానక్‌రాంగూడ పర్యటనలో భాగంగ శుక్రవారం ఉదయం ఈ ప్రాంతం మీదుగా వెళుతుండగా నిర్మాణ మిశ్రమం రోడ్డుపైకి వచ్చిన నేపథ్యంలో నిర్మాణ సంస్థకు వెళ్ళి పెనాల్టీ విధించాలని అధికారులను ఆదేశించారు. దీంతో రూ.25వేల పెనాల్టీ వేశామని, మరోసారి ఇలాంటివి పునరావృతం అయితే లక్ష రూపాయలు వేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, భక్తులు

రాయదుర్గం: వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య వీరాంజనేయ స్వామి ఆలయంలో వివిధ దేవతామూర్తుల ప్రతిష్ఠాపనా మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. గోపన్‌పల్లితండాలో స్వయంభూ వీరాంజనేయస్వామి ఆలయంలో ఈ విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చనలు, పూజలు, అభిషేకాలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీరాములు, తిరుపతి, రాజునాయక్, రామ్‌నాయక్, మన్నెరమేష్, ప్రకాశ్, మహేష్, ప్రసాద్, గోపన్‌పల్లితండావాసులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మట్టిరోడ్డు ..ప్రమాదాలు జరుగుతున్నాయ్



ప్రమాదాలకు నిలయంగా మారుతున్న ర్యాంప్ రోడ్డు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రింగ్ రోడ్డు నిర్మాణ సమయంలో దానిని ఆనుకొని సర్వీసురోడ్డు నిర్మించారు. కొల్లూరు, ఈదుల నాగులపల్లి మధ్య రైల్వే ట్రాక్ కారణంగా సర్వీస్ రోడ్డును అభివృద్ధి చేయలేదు. ప్రజల ఒత్తిడి మేరకు తాత్కాలికంగా రింగ్ రోడ్డును ఆనుకొని మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. మట్టిరోడ్డు కారణంగా నిత్యం ఇక్కడ ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. సర్వీస్ రోడ్డు ఆనుకొని అనేక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలకు చెందిన బస్సులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదాలు జరుగుతుండడంతో గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఈ మట్టి రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మాణానికి పనులను సైతం ప్రారంభించారు. ఆ పనులను హెచ్‌ఎండీఏ అధికారులు అడ్డుకున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. స్కూల్ బస్సులు సైతం వస్తుంటాయి. సర్వీసు రోడ్డును పూర్తి చేసేందుకు ఈ మధ్యకాలంలో రైల్వేలైన్‌పై వంతెన నిర్మాణం చేపట్టారు. ఆ పనులు నత్తనడకన సాగడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వంతెన పనులను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాలకు నిలయంగా మారిన ర్యాంప్ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.